ప్రజల మాట ప్రగతి బాట

రాజేంద్రనగర్ నియోజకవర్గం

# మరోసారి ఆశీర్వదించండి

- అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, నవంబర్ 13 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వందలాది మంది యువత బీజేఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు వంటి అనేక పథకాలు నిరుపేదలకు ఎంత ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందన్నారు.

**గడపగడపకు బీఆర్ఎస్...**

అత్తాపూర్, నవంబర్ 13: గడపగడపకు బీఆర్ఎస్‌ను తీసుకువెళ్లేందుకు ముమ్మర ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి, సురేశ్‌రెడ్డి తెలిపారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాలే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. రానున్న రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి కానుందన్నారు. ప్రజలు తమ పూర్తి మద్దతును బీఆర్ఎస్‌కే అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, కపిల్, రవి, మహేందర్, కృష్ణ, నరేశ్, హర్షిత్, శివ, పి.ఎం.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భారీ మెజార్టీతో గెలిపించాలి**

శంషాబాద్ రూరల్, నవంబర్ 13 : ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కౌన్సిలర్ చెన్నం అశోక్ ప్రజలను కోరారు. సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో స్థానిక కౌన్సిలర్ చెన్నం అశోక్ ఆధ్వర్యంలో గొల్లపల్లిలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడం కోసం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గణేశ్‌గుప్త, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, చైర్మన్ సుష్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, బండిగోపాల్, ప్రశాంత్‌రెడ్డి, చిక్కిరి శేఖర్, సతీశ్, ప్రవీణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు మద్దతుగా మండలంలోని ముచ్చింతల్, గచ్చిబాయితండా, మదన్‌పల్లి తదితర గ్రామాల్లో గణేశ్‌గుప్త, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, వైస్ ఎంపీపీ నీలంనాయక్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తోనే సాధ్యమన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీరటి రాజుముదిరాజ్, శ్రీనివాస్, మోహన్‌నాయక్‌తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



సెంట్రింగ్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



శంషాబాద్ మున్సిపాలిటీ 9వ వార్డు గొల్లపల్లిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ చెన్నం అశోక్



అత్తాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిద్దెల సురేందర్‌రెడ్డి, తదితరులు



ముచ్చింతల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు గణేశ్‌గుప్త

## రైతన్నను ప్రోత్సహించడమే లక్ష్యం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న శాస్త్రవేత్త డా.బి. శరత్ బాబు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 13 : దేశానికి అన్నం పెట్టే రైతన్నను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ అధికారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అందుకు మనం మరింత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీపీఏఐ) చైర్మన్, సీనియర్ శాస్త్రవేత్త డా.బి. శరత్ బాబు తెలిపారు. ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో గల ఆడిటోరియంలో స్వర్ణోత్సవ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ, అనుబంధాల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తన ప్రక్రియ చేపట్టడం వంటి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వివిధ పంటలలో అనేక రకాలైన కీటకాలు, తెగుళ్లు పంటలను ఆశించి కలిగే నష్టాలను వాటి నియంత్రణ కోసం సమగ్ర యాజమాన్యం, తగిన శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రోత్సహించడానికి 1972లో సంస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ సదస్సుకు దాదాపు 500 మందితో కూడిన ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, భారత వ్యవసాయ పరిశోధన మండలి, మొక్కల సంరక్షణ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, వివిధ వ్యవసాయ ఉద్యాన వన యూనివర్సిటీలు, ప్రతినిధులు .పాల్గొంటారన్నారు. అంతకు ముందు స్వర్ణోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. శ్రీలత, డా. చలపతిగిరి, హన్మాన్ జెల్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

బండ్లగూడ, నవంబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ శిల్ప గుప్తా రాజేంద్రనగర్‌లోని పలు కేంద్రాలను రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికల ఏర్పాట్లపై అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులతో పాటు భద్రతకు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరాముల్, రిటర్నింగ్ అధికారి మల్లయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవికుమార్ ఉన్నారు.

## మెకానిక్‌షెడ్‌లో అగ్ని ప్రమాదం

బండ్లగూడ, నవంబర్ 13 : మెకానిక్ షెడ్‌లో పటాకులు పడటంతో ఆ షెడ్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ ప్రజెంట్ పార్కులో ఉన్న ఓ మెకానిక్ షెడ్‌లో ఆదివారం రాత్రి పటాకులు పేలాయి. దీంతో ఆ మెకానిక్ షెడ్‌లో రసాయనాలు ఉండటంతో మంటలు అంటుకొని షెడ్ పూర్తిగా దగ్ధమైంది. అందులో మరమ్మతుల కోసం వచ్చిన రెండు కార్లు కూడా మంటలలో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న షెడ్ యజమాని సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి రెండు ఫైర్ ఇంజన్లు చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బండ్లగూడ, నవంబర్ 13 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తులసి (35) ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

# సెంట్రింగ్ కార్మికులకు అండగా ఉంటా

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 13: సెంట్రింగ్ కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సెంట్రింగ్ అసోసియేషన్ కార్మికులు సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సెంట్రింగ్ కార్మికుల కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యేకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయనను శాలువాలు, పూలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికుల జీవితం ఎన్నో ప్రమాదాలతో కూడుకున్నదని అన్నారు. అనుక్షణం అభద్రత భావంతో సెంట్రింగ్ కార్మికులు పని చేస్తారని అన్నారు. భవన నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర ప్రధానమైనదన్నారు. అయితే వీరికి పనికి తగ్గ ప్రతిఫలం దొరకకుండా లేదన్నారు. దళారులు, మధ్యవర్తులు అసంఘటిత రంగంలో ఉన్న సెంట్రింగ్ కార్మికులను దోచుకుంటున్నారన్నారు. సెంట్రింగ్ కార్మికులు సంఘటితంగా ఉండి శ్రమకు తగ్గ వేతనాల కోసం కలిసి పని చేయాలన్నారు. తాను ముందుండి వీరందరికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. కార్మిక శాఖ వారు అసంఘటితంగా ఉన్న సెంట్రింగ్ కార్మికులకు భరోసా కల్పించేందుకు ప్రమాద బీమా లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు అందించేందుకు ఎమ్మెల్యే ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. మరోసారి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సెంట్రింగ్ కార్మికుల పూర్తి మద్దతు అందిస్తున్నామన్నారు.ఏసు, మల్లేశ్,అశోక్, బాలరాజు ఉన్నారు.